ఈ వారం కథ



టేబుల్ విరిగిపోయింది... ఫ్యాన్ విరిగిపడిపోయింది... ఫోన్ పగిలి పోయింది... కిటికీ అద్దాలు పగిలిపోయాయి, ఫైళ్ళన్నీ చిరిగి పోయాయి... ఆఫీసు కూలిపోయింది... అంతా... ఇదంతా వెదిరిపోయింది... పోయింది...

పోతే బాగుణ్ణు! పోదు

కానీ బ్రతుకంతా వెదిరిపోయింది. చిరిగి, విరిగి పగిలి, చెదిరిపోయింది... పోతోంది.

యాభై యేళ్ళు ... ఏవీ ఎక్కడికి పోయాయి? ఎటు పోయాయి?

వెళ్ళిపోయిన యేళ్ళు వెక్కిరిస్తున్నాయి.

ఇక లెక్కపెట్టుకుంటూ బ్రతకాలి - యాభ య్యొకటి - యాభై రెండు - యాభై మూడు... రిటైర్మెంటు- ప్రావిడెంట్ ఫండు ... ఈజీ చైరూ- న్యూస్‌పేపరూ-

ఈ అరవ గోలలోనే వుండిపోవాలా? వుంటే- హైదరాబాద్ నుంచి కొడుకు నెలకింత అని పంపు తాడు కాబోలు... బెంగుళూరులో వున్న కూతురు ఎప్పటికి చేసుకుంటుంది పెళ్ళి?

మూడు రాష్ట్రాల రాజధానుల మధ్య ముక్కలు చెక్కలైపోయింది జీవితం - విష్ణుమూర్తి జీవితం!

భార్యకి ఆస్మా! ఎప్పటికీ బాగుపడదు. బీచికి షికారుకైనా రాదు. టి.వి. తప్ప మరో ప్రపంచం లేదు. క్లబ్బు స్నేహాల్లో రుచి లేదు. మందు పుచ్చుకునే దమ్ములేదు. శరీరానికి ఇక ఏ సరదాలూ అక్కర్లేదు.

కంపెనీ లాభాల్ని 'మేనేజ్' చేసేస్తూ సగటు గుమా స్తాల్ని అజమాయిషీ చేస్తూ జీవిత శేషాల్ని ఆఫీసులో ఇంకా కొంచెం తగలెయ్యాలి. ఆ తర్వాత?-

ఆ తర్వాత ఊహించలేని విష్ణుమూర్తి విసుగ్గా వాచీ 'చూసుకునేసరికి నాలుగుమ్ముప్పావయింది.

ఇక వెళ్ళిపోదామనుకుంటూ వుండగా ఫోన్ మోగింది.

"పర్సనల్ కాల్ సర్... మీతోనే మాట్లాడా లంటున్నారు..."

"ఎవరు?"

"ఎవరో లేడీ"

ఫోన్‌లో పలికిన లేడీ గొంతు శతాబ్దాల మంచు తెరలు మాటు నుంచి మోగిన కిన్నెరలా వుంది.

"నేను దుర్గని"

మళ్ళీ జీవితంలో వినలేదా పేరు - ఆ గొంతు - అదిరిపడ్డాడు.

ఆఫీసు గది గోడలు గిర్రున తిరిగి ఆగాయి. అన్ని వస్తువులూ దూరం వెళ్ళిపోయి మళ్ళీ వచ్చి చేరాయి. గుండె ఒక్క క్షణం ఆగి మళ్ళీ కొట్టుకుంటోంది.

"ఏ దుర్గ?"

అర్థంలేని ప్రశ్నకు అద్భుత సమాధానం-నవ్వే

ఏ దుర్గ! ఎప్పటి దుర్గ! ఎక్కడి దుర్గ!

"గుర్తులేనా? అప్పుడు రాజమండ్రిలో గుర్తుందా? బొంబాయిలో వుండిపోయాం. ఆ తర్వాత ... తెలి సింది... మళ్ళీ వెళ్ళి పోతున్నాం... వస్తావు కదూ?... చూస్తుంటాను..."

"ఓ...ఎస్... తప్పకుండా..."

ఫోన్ పెట్టేశాక గాభరాపడ్డాడు.

సీటుకి జేరగిల పడిపోయాడు. ఫోన్ పెట్టేసినా, ఇంకా మాటలు వినబడుతూనే వున్నాయి ఫోన్‌లోంచి.

ఏవీ జరగదనుకున్నప్పుడు ఏది జరిగినా ఎంత గాభరా! ఎంత గాభరా!

తనేం చిన్నపిల్లాడు కాదిప్పుడు - ఫిఫ్టీ ఇయర్స్ - యాభై యేళ్ళు...

ఇంటికెళ్ళి లక్ష్మికి చెప్పి, ఆ తర్వాత స్టేషన్‌కి వెళ్తే?

భార్యకి చెప్పి వెళ్ళాలా - ప్రియురాలి దగ్గరికి!

ఏ ప్రియురాలు! ఎక్కడి ప్రియురాలు! దుర్గకీ వుంటాయి - కనీసం నలభయ్యయిదు.

ఇప్పుడిక ఇంటికి వెళ్ళబుద్ధి కావడం లేదు.

పాపం లక్ష్మి దగ్గుతూ వుంటుంది, వుంటే వుండనీ గాక.

మామూలు టైంకన్నా ముందే బైటపడుతున్న మేనేజర్ విష్ణుమూర్తి వైపు ఆఫీస్ స్టాఫ్ అంతా వింతగానే చూస్తున్నారు.

చూస్తే చూడనీగాక-

మామూలు బస్టాప్‌ని కూడా దాటి నడుచుకుంటూ వెళ్ళాడు.

అర్థం పర్థం లేకున్నా ఆలోచనల్లో దుర్గని పరా మర్శిస్తూ నడవాలనే వుంది...

హోటల్‌లో దూరి కాఫీ తాగాడు.

కాఫీ గ్లాసులోంచి దుర్గ ప్రత్యక్షమైంది. "అవును విష్ణుమూర్తీ! చూశావా? నేను నిన్ను మర్చిపోలేదు-"

బిర్లిస్తూ వుంటే - కౌంటర్ వాడి కళ్ళజోడు లోంచి దుర్గ తొంగి చూసింది -"నన్నిప్పుడు గుర్తు పట్టావా విష్ణుమూర్తీ..."

అందుకే గాభరాగా వుంది. మళ్ళీ నడుస్తూ అనుకు న్నాడు-

ఆమె గుర్తుంచుకుంది.

నేను గుర్తయినా పట్టగలనా?

పొగ మంచుతెర వెనక గుబురు వారన పడి వుంది - రాలిన పువ్వా? జ్ఞాపకమా?

అప్పుడు రాజమండ్రిలో...

ఎప్పుడూ? ఎన్నేళ్ళా?

పాతికా! ముప్ఫయ్యేళ్ళయి పోయాయా... అప్పుడే...

వాడి రాలిన పువ్వేదో చిన్నగా సన్నగా కదిలినట్లు



## తత్వవేత్త ఛలోక్తి

భారత దేశానికి పది సంవత్సరాలు ఉప రాష్ట్రపతిగా- అయిదు సంవత్సరాలు రాష్ట్రపతిగా పదవికి ఘనతి చేకూర్చిన ప్రపంచ ప్రఖ్యాత తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, ఆయన ఎంత మహా తత్వవేత్త అయినా ఆయన ఉపన్యాసాలలో ఛలోక్తులు, హాస్యోక్తులు అనుకో కుండానే దొర్లుతుండేవి. ఒకసారి సర్ మహ్మద్ ఉస్మాన్, డాక్టర్ రాధాకృష్ణన్ ఒకే సభలో మాట్లాడవలసివున్నది. సర్ మహ్మద్ ఉస్మాన్‌ని గురించి సర్వేపల్లి ఇలా చెప్పారు. "శ్రీ ఉస్మాన్ నాకు చాలా సన్నిహితుడు. ఆయన కాలేజీలో మొదట నాకు సీనియర్, ఆ తర్వాత నా క్లాస్‌మేట్, ఆ తర్వాత నాకు జూనియర్, తర్వాత నేను ప్రొఫెసర్‌గా ఉన్నప్పుడు ఆయన వైస్ ఛాన్సలర్ - నేను వైస్ ఛాన్సలర్‌గా ఉన్నప్పుడు ఆయన ఛాన్సలర్" వ్యంగ్యాన్ని అందుకున్న సభ నవ్వుల్లో మునిగి తేలింది.

—జొన్నలగడ్డ లలితాదేవి




పెదవులు రెండూ కలిసిన చోట నీటిసుడిలా చిమ్మిన సంతోషపు ముక్క-

నవ్వేనా అదీ? ఆమె నవ్వేనా?

ఆ నవ్వే - దుర్గా?

సాయంత్రం చిక్కబడుతుండగా కాళ్ళు సాగదీస్తూ కావాలనే తీరిగ్గా నడిచాడు.

ఏడూ ఏడున్నరకి స్టేషన్‌కి వస్తామంది. ఇంకా ఎవరెవరు వుంటారో? అయితే- భర్త మాత్రం వుండడు. ఎందుకంటే - భర్త లేడు గనుక! పోయాడు గనుక!

ఎవరో ఎప్పుడో చెప్పిన గుర్తే..!''పాపం మా దుర్గ భర్త సడెన్‌గా చచ్చిపోయాట్ట తెలుసా? బొంబాయిలోనే..!''

ఎవరు చెప్పారో కూడా గుర్తులేదు. ఎప్పుడో - మళ్ళీ యేళ్ళు లెక్కపెట్టినా తేలదు.

తల వంచుకుని తవ్వుకుంటున్న స్మృతుల్లో తల మునకలవుతూనే నడిచాడు విష్ణుమూర్తి.

మసకేసిన జ్ఞాపకాల్లో, దారి తెలీని మలుపుల్లో తారాడుతూ తలెత్తి చూసి, చీకటి పడడం గ్రహించి, వాచీ చూసుకుని ఉలిక్కిపడి, వెంటనే ఆటో ఎక్కేశాడు.

కిటకిలాడుతోంది స్టేషన్.

సెంట్రల్ స్టేషన్.

చెప్పిన చోట చేరుకుని, ప్లాట్‌ఫాం చివరకి చూడగా - దూరాన కనిపించింది - దుర్గ-

ఆమెకేసి ఒక్కో అడుగూ నడుస్తూ వుండగా - ఒక్కో సంవత్సరం వెనక్కి వెనక్కి వెళ్ళిపోయింది.

గోదావరీ తీరాన కొబ్బరాకుల కింద పెంకుటింటి వసారాలో సీతాకోక చిలకలాంటి పద్దెనిమిదేళ్ళ పడుచా?

సెంట్రల్ స్టేషన్‌లో నీడల చారల ప్రక్కన, తెల్లటి జుట్టు మెరుస్తున్న యాభై పైపడిన వనితా?

అదుర్గే ఈ దుర్గా?

ఈమె ప్రౌఢ? వృద్ధా?

నవ్వింది. నవ్వాడు.

కొంచెం పక్కనే వున్నాడు - తెలుస్తూనే వుంది- ఆమె కొడుకూ కోడలు - ముగ్గురు పిల్లలు - మరాఠీ - హిందీ కలిపి కొడుతున్నారు.

కొడుక్కి పరిచయం చేసింది ...''విష్ణూ అంకుల్ - చెప్పానుగా'' అంటూ.

ఏం చెప్పిందో దుర్గ. ఏమైనా చెప్తుంది. ఆ మాట కొస్తే - అసలేమీ చెప్పదు.

వాళ్ళనక్కడే వుండమని, అతనితో బాటు అవతలకి నడిచింది.

శాలువ కప్పుకుని - ఆ నడవడంలో ఠీవి వుంది -

''వాడికేదో బిజినెస్ పని కూడా వుందన్నాడు గాని - నేనయితే మద్రాసు వచ్చింది - నిన్ను చూద్దామనే విష్ణూ ... ఎలాగున్నావ్?''

మనిషి లావయింది. బొట్టులేని నుదుట వారగా జాలుగా తెల్లటి వెంట్రుకలు. పలుచగా ముడి, సాదా చీర, లాంఛనంగా నగలు, సింపుల్, మనసెంతో మనిషి అంతే-అప్పుడూ ఇప్పుడూ.

కాలంతో పిలుపు మారలేదు. పాతికేళ్ళు కూడా నువ్వును మారు వెయ్యలేదు.

షాపులున్న వైపుకి నడుస్తున్నారు. కొడుకూ కోడలుతో అంతకు ముందే చెప్పిందేమో. నిష్పూచీగా వస్తోంది. తనే మాట్లాడుతోంది-

''ఆయన పోయాక భారమంతా నా మీదే పడింది విష్ణూ...వాడికప్పటికి పన్నెండేళ్ళే... ఆ తర్వాత మామ గారూ పోయారు. అత్తకి మూణ్ణెళ్ళ క్రితం ఆపరేషన్ చేయించాం... ఇప్పుడంతా వాడే చూసుకుంటాడు... ఫ్యాక్టరీ పనుల్తో క్షణం తీరిక వుండదు. తిరపతి మొక్కుందని కోడలు పట్టు పట్టింది. రాక తప్పింది కాదు... ఏం నువ్వు రాలేకపోయావా ఓసారి బొంబాయి... నా అడ్రసే తెలీదంటావా?''

అతనికీ తెలుసు. జవాబుల్తో పనిలేని మాటలివి. మనసులో మనసు కదుల్తూనే వుంటుంది.

మానవారణ్యంలో మనసులు నలుగుతూ వుంటాయి. స్మృతులు నిద్రలో జారిపడుతుంటాయి. ఏది చేరువ? ఏది దూరం?

''నీ గురించి మాత్రం ... ఎప్పటికప్పుడు తెలుసు కుంటూనే వున్నాలే విష్ణూ. బెంగుళూరులో వుందటగా మీ అమ్మాయి? లెక్చరర్ ఉద్యోగమేనా? పోనీ - ఇక్కడే ఏదైనా జాబ్ ట్రై చేయవచ్చుగా? నువ్వు వూరికే దిగులుపడితే ఏం లాభం ... ఎప్పుడో చేసుకుంటుంది - తన పెళ్ళి తనిష్టం ...కాదంటావా?''

ఆశ్చర్యపోతున్నాడు.

తన గురించి ఇన్ని సంగతులు ఆమెకు ఎవరు చెప్పి వుంటారు?

తన బంధు మిత్రుల -మిత్రుల బంధువుల - పరిచయస్థుల బంధువుల మిత్రుల ద్వారా కనుక్కుంటోందా? లేక ఇదేదైనా అతీంద్రియ శక్తా?

కాఫీ చప్పరిస్తూ వుంటే, కాలం పొగలు చిమ్ముతూ ఎగసిపోతూ వుంది.

రాజమండ్రి కొబ్బరి చెట్టు ఇంకా కిందికి వంగి చెవిలో గుసగుసలాడింది.

ఈ దుర్గే ఆ దుర్గ-

ఆ వసారా నుంచి మీ వసారాకి మావుల పూల తోరణాలు కట్టినది ఈ కళ్ళే... నువ్వు కనిపిస్తే స్వామి దర్శనమైనట్టు పులకించిపోయినవి, ఈ పెదవులే, ఈ వెల్తురే ఆ నీడా -

లేక - ఈ నీడే ఆ వెల్తురా?

అంతా గుర్తుంది. ఏదీ మరచిపోలేదు-

కాస్త ఓరగా సిమెంటు బెంచీలో కూచున్నారు. ఆమె ఇంకా ఏమిటేమిటో మాట్లాడుతోంది యోగక్షేమాలు- ''మీ ఇంటికే రావాలనుకున్నా... కాని టైం లేదు - మీ ఆవిణ్ణి అడిగానని చెప్పు ... ఏం ... ఆవిడకి తెలుసా నా గురించి?... పుట్టి భోళా మనిషివి- అంతా చెప్పే వుంటావు... నాకు తెల్సు''

'కృష్ణా పత్రిక' సంపాదకులు అయిన ముట్నూరి కృష్ణారావు గారి దగ్గరకోసారి కొందరు వచ్చి ఆయనను పొగడడం మొదలు పెట్టారు. ఆయనకు పొగడ్తలంటే చెడ్డ చిరాకు. ''మీ కలం కత్తిలాంటిది, మీ సంపాదకీయాలు దుందుభులు. ఎంత పాండిత్యం! ఎంత వేదాంతం! ఎంత ప్రతిభ! ఎంత దేశభక్తి! ఇలా ప్రవాహంలా సాగుతున్న ప్రశంసల ప్రభంజనానికి హఠాత్తుగా అడ్డుకట్టవేస్తూ కృష్ణారావుగారిలా అన్నారు- 'ఒక్కసారిలా చూడండి' అంతా ఆయనేదో చెప్ప బోతున్నారని ఆయన వైపు చూశారు. ఆయన నెత్తి మీదనున్న పెద్ద తలపాగ తీసి బల్లపై పెట్టి నున్నగానున్న బట్టతలను తడుముకుంటూ... 'నాకున్న ప్రత్యేకత ఇదొక్కటే. ఎందుకు బట్టతలకు క్రాపింగ్ దువ్వుతారు' అన్నారు. అంతే వాళ్ళు పలాయనం చిత్తగించారు.

—ఎస్.ఎన్. రసూల్



దుర్గకి అంతా తెల్సు.

లక్ష్మికి అంతా చెప్పాడు. అయితేనేం - ఎప్పుడో మర్చిపోయింది లక్ష్మి.

ఎదురింటి ప్రేమలు ఎంత వరకు వస్తాయి?

ఎంతవరకైనా వెళ్ళాలనే తపన, ఆరాటం, కోరిక...

కోరికో, ప్రేమో అప్పుడేమీ తెలీదు. చూపు తర్వాత మాట, మాటతోటే మనసూ కలిశాక కూడా...

"అమ్మో మా వాళ్ళు చంపేస్తారు" అంది దుర్గ అప్పుడు-

"మావాళ్ళూ అంతే... అయితే మనం ధైర్యం చెయ్యక తప్పదు"

అంటే-

"అంతేనంటావా?" అంది దుర్గ.

అంతేననుకుంది, అంతే చేసింది దుర్గ.

పెళ్ళి మూడు రోజులుండనగా ఆ రోజు రాత్రి కట్టు బట్టలతో వీధి చివర కమ్మరింటి పక్కన పాత మండీ గోడ నీడలో నిల్చోలేదూ-

తనే - నాశనమైపోయాడు. పిరికితనంలో కూరుకుపోయాడు. ఊబిలో బిగుసుకుపోయాడు.

తెల్లారే వేళకే - వీధిలో గుసగుసలు పాక్కాయి.

ఎదురింట్లో ఏడుపులు - శాపనార్థాలూ

దుర్గని తిట్టారా?, కొట్టారా?

ఆ వెంటనే అటూ ఇటూ పెద్దల హడావుడి, హుంకారాలు, సవాళ్ళు, రౌద్ర బీభత్సాలు...

పెడరెక్కలు విరిచి కట్టినంత పనిచేశారు. తనని గోదారి దాటించేశారు, నెల్నాళ్ళు!

స్వర్గం అంతలో నరకమైపోయింది. దుర్గ కల అయిపోయింది. పిరికితనాన్ని కూడా ఓదార్చుకోవడం అలవాటై పోయింది.

"అట్లా వున్నావేం విష్ణూ... ఏంటో - ఆలోచిస్తున్నావే..."

"నన్ను... క్షమించావా ... నువ్వు?" మొదటిసారిగా మాట్లాడాడు - ఇప్పుడే-

మళ్ళీ ఆ రాత్రి తర్వాత - ఇన్నేళ్ళ తర్వాత!

"లే- నడుద్దాం - పద-" అంటూ కదిలింది.

అదీ దుర్గ!

ఏమీ చెప్పక్కర్లేదు.

అంతా అర్థమౌతుంది.

ప్లాట్‌ఫామ్మీద రద్దీ ఎక్కువయింది.


దుర్గ కోసం చూస్తున్నారు కొడుకూ కోడలూ.

"కాస్సేపు - పాత బంధువుల గురించి మాట్లాడుకున్నాంలేరా" అంది దుర్గ కొడుకుతో.

వాళ్ళేమైనా అడిగారు గనకనా?

పెట్టెలూ, సూట్‌కేసులూ సరిచూసుకుంటూ, పిల్లల్ని అజమాయిషీ చేస్తోంది కోడలు. ఆమెతో మరాఠీలో ఏదో మాట్లాడింది దుర్గ-"ఇదే అలవాటైంది... ఎప్పుడోగాని తెలుగు మాట్లాడం" అంది విష్ణుమూర్తితో.

మరీ చిత్రం




ప్రఖ్యాత న్యాయవాది శ్రీ సి.పి.రామస్వామి అయ్యర్ గారికి జడ్జిగా అవకాశం వస్తే తిరస్కరించారు. విలేకరులు వివరణ అడుగగా "నానా చెత్త వాగుడూ వినడం కన్నా ఆ చెత్తేదో వాగడమే శ్రేయం" అన్నారు తన సహజ ధోరణిలో.

—పద్మశ్రీ, మాణిక్యారం

భాషైనా మారిపోయింది.

మనిషిలో మనసు మారలేదు.

సామాను మధ్య వున్న పెద్ద ట్రంకుపెట్టె దగ్గరికెళ్ళింది దుర్గ. దానిమీద కూచున్న మనవణ్ణి లేపి, మూత తెరిచి, లోపల్నుంచి ఒక చెక్క పెట్టె తీసుకొచ్చింది.

ఆ పెట్టెకి పసుపూ, కుంకుమా రాసి వున్నాయి.

విష్ణుమూర్తి ముందు ఆ పెట్టె పెట్టి, మూత తీసింది దుర్గ. లోపలి నుంచి ఒక్కసారిగా సువాసనలు గుప్పుమన్నాయి. చందనం, అగరు, కర్పూరం... ఇంకా ఏమిటేమిటో ... పెట్టె లోపల పూజా సామగ్రి పుష్కలంగా వున్నాయి.

వాటి మధ్య నుంచి చిన్న వెండి బొమ్మ తీసింది దుర్గ. ఆ బొమ్మకి నిత్యపూజ జరుగుతున్న చిహ్నంగా పసుపు కుంకం రాసి వున్నాయి. "కాపురానికెళ్ళిన రోజే - అత్త ఇచ్చింది - మన కులదైవం విష్ణుమూర్తి - ఏ రోజూ పూజ లేకుండా వుండకూడదని చెప్పింది -

కాకతాళీయం కదూ... నీ పేరు కూడా అదే కావడం" అంటూ దుర్గ - ఆ పెట్టెలోంచే మరో చిన్న బట్టల మూట తీసింది.

కావటానికి పేలికల్లా, బట్టలోపల బట్ట చుట్టి వుంది.

చాలా జాగ్రత్తగా తీసింది దుర్గ.

"చూడూ - గుర్తుందా?" మెరుపు కొట్టింది!

బొమ్మ-

చిన్న బొమ్మ-

గాజుబొమ్మ-

పరికిణీ కట్టుకున్న పాప బొమ్మ, రెండు చేతులూ అభయ ముద్రలో వున్నట్టు ముందుకు చాచి నాట్య భంగిమలో వుంది.

చికిలి పనితనంతో, నగిషీలతో చాలా అపురూపంగా వుందా బొమ్మ.

కానీ గాజుబొమ్మ-

క్రింద పడిందా - పోలిక తెలీదు-

"గుర్తుందా - ఆ రోజు - నా పుట్టిన రోజప్పుడు - పెరట్లో బాదం చెట్టు దగ్గరికి ఎవరూ చూడకుండా వచ్చేశావు. ఇది నా చేతుల్లో పెట్టి గాభరా పడిపోయావు - నేనూ..." అని ఆగి చూసింది.

సంవత్సరాలు కుప్పకూలిపోయాయి.

కాలంలో ఆ క్షణం పేరు ఒక ముద్దు.

వణికే చేతుల్తో తాకాడు విష్ణుమూర్తి ఆ బొమ్మను. "ఇంకా అట్లాగే పెట్టుకున్నావా ఆ బొమ్మను - అదే బొమ్మా ఇదీ?"

కళ్ళు తేలిపోతున్నాయి.

"ఏదో అడిగావు కదా విష్ణూ... క్షమించావా అనీ..."

"దుర్గా..."

"మనుషులంతే ... ఇంతే విష్ణూ..."

కఠోరంగా కూస్తోంది ఇంజన్. గోల గోలయిపోయింది. క్షణాల్లో అందరూ రైలెక్కేస్తున్నారు.

కొడుకు నానా తంటాలూ పడి సీటు వెదికి పట్టుకున్నాడు. కోడలు లగేజీల్తో, పిల్లల్తో తంటాలు పడుతోంది.

నెమ్మదిగా గాజుబొమ్మను పెట్టెలో సర్దేసి, పెట్టె మూసేసి, దాన్ని మళ్ళీ ట్రంకు పెట్టెలో పెట్టేసింది దుర్గ.

కాలానికి మళ్ళీ తెర పడింది.

కొడుకొచ్చి ఆ పెట్టెను కూడా తీసుకెళ్ళాడు. తల్లిని కూడా వచ్చెయ్యమని తొందర చేశాడు.

"దిగులు పడకూడదు విష్ణూ... అంతా మన మంచికే ననుకుంటే - దిగులెందుకుంటుంది చెప్పు... ఎప్పుడైనా ఆ ఆవిణ్ణి కూడా తీసుకుని బొంబాయి రారాదూ?"

కంపార్ట్‌మెంట్లో కెళ్ళి, సీట్లో కూచుంది దుర్గ.

ముదిరిపోయిన రాత్రీ మంచు కురుస్తోంది.

రైలు కిటికీ ఇవతల శూన్యంలో-శూన్యంలా నిలబడ్డ విష్ణుమూర్తికేసి నవ్వుతూ చూసింది దుర్గ.

ఎండిన చెట్టులాంటి తెల్లటి జుత్తు కింద, లేత చివురులో తలెత్తే పచ్చటి మొలకలాంటి నవ్వు -

రెండు పెదవులూ కలిసే చోట నీటి సుడిలాంటి నీడ చుక్క-

"వెళ్ళింక విష్ణూ... మీ ఆవిడ చూస్తూ వుంటుంది"

అంకుల్‌కి గోల గోల గా టాటా చెప్తున్నారు పిల్లలు.

విష్ణుమూర్తి వైపు చూస్తూ చూస్తూ వుండి తలాయిన చిరిగిన్న శాలువా తీసేసింది దుర్గ.

కొడుకూ కోడలూ విస్తుపోయి చూస్తున్నారు కూడా.

కిటికీలోంచి శాలువ ఇవతలికి తీసింది దుర్గ. చేయి చాస్తూ దాన్ని విష్ణుమూర్తి భుజం మీదికి చేర్చింది.

"మంచు కురుస్తోంది విష్ణూ"

అంతలోనే కదిలింది రైలు.

ఆమె చూపుతోనే, నవ్వుతోనే దూరం దూరమైపోయింది.

స్టేషన్ దాటి వెలుగునీడల మధ్య అడుగేస్తున్నాడు విష్ణుమూర్తి.

శాలువ కింద చేతులు ముడుచుకున్నాడు- దేన్నో పొదువుకున్నట్టు.

అవును.

గుండెలో నవ్వుతోంది - గాజుబొమ్మ.